బోనాల జాతరకు తొట్టెల ప్రత్యేకం

- అమ్మవారికి మొక్కుల రూపంలో తొట్టెల సమర్పణ
- 3 అడుగుల నుంచి 35 అడుగుల ఎత్తు వరకు తయారీ
- సాధారణ రోజుల్లో కూడా మొక్కుల రూపంలో తొట్టెల సమర్పణ


అందంగా తీర్చిదిద్దిన తొట్టెల (ఫైల్)

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో తొట్టెలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. తెలంగాణ, సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా భక్తులు తొట్టెల రూపంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ తొట్టెలలో అమ్మవారు సేద తీరుతారని భక్తుల విశ్వాసం. అమ్మవారికి ఊయల లాగా ఈ తొట్టెలను సమర్పిస్తారు. కోరిన కోర్కెలు తీరాలని కొందరు.. ఎల్లప్పుడు ఆయురారోగ్యాలతో చల్లంగా ఉండాలని మరికొందరు తాము అనుకున్న పనులు కావాలంటూ ఇంకొందరు తొట్టెలలను అమ్మవారికి సమర్పిస్తుంటారు. బోనాల ఉత్సవాల నిర్వాహకులు అతి పెద్ద తొట్టెలలను తయారు చేయించి భాజాభజంత్రీలతో పోతరాజుల నృత్యాల నడుమ ఎంతో హంగామాతో ఆలయానికి ఊరేగింపుగా తరలిస్తారు. ఇప్పటికే ఈనెల 22న, గోల్కొండ బోనాల జాతర ఉత్సవాలలో నిర్వాహకులు భారీ తొట్టెలను సామూహిక ఊరేగింపుగా గోల్కొండ కోటకు తరలించారు. ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనంతో పాటు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. పూల తొట్టెల, వెండి తొట్టెల, బంగారు తొట్టెల.. ఇలా తమ మొక్కులకు అనుగుణంగా భక్తులు అమ్మవారికి తొట్టెల సమర్పిస్తారు.


చార్మినార్‌లో తొట్టెల తయారు చేస్తున్న మహిళ

బోనాల జాతర ఉత్సవాల్లో తొట్టెలకు ఎంతో ప్రాధాన్యం..

మహంకాళి జాతర బోనాల ఉత్సవాల్లో తొట్టెలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ తొట్టెలలు 3 అడుగుల నుంచి 35 అడుగుల ఎత్తు వరకుంటున్నాయి. 5 నుంచి 7 అంతస్తులుగా పిలిచే ఈ రంగురంగుల తొట్టెలను ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. భాజాభజంత్రీలు..పోతరాజుల నృత్యాల నడుమ యువకులు ఘనంగా తొట్టెల ఊరేగింపు కొనసాగిస్తారు. అమ్మవారికి తొట్టెల సమర్పించకుండా బోనం పెట్టరు. బోనంతో పాటు అమ్మవారికి తొట్టెల ఎక్కించడం తప్పనిసరి. ఆషాఢమాసం ప్రారంభం నుంచి నెల రోజుల పాటు మహంకాళి అమ్మవారి ఆలయాల్లో ప్రతిరోజూ భక్తులు తొట్టెల సమర్పిస్తారు.

ప్రత్యేకంగా రూపొందించే తొట్టెలల వివరాలు..

- ఏడు బోనాల తొట్టెల: ఇది 25 అడుగుల పొడవుంటుంది. దీని తయారీకి వారం రోజులు పడుతుంది. ఖరీదు దాదాపు రూ.45 వేలు.
- సాధారణ ఫలహారపు బండి తొట్టెల: ఇది 25 అడుగులు పొడవుంటుంది. దీని ఖరీదు రూ.35 వేలు. తయారీకి నాలుగు రోజులు పడుతుంది.
- హంస ఫలహారపు తొట్టెల: ప్రత్యేకమైన డిజైన్‌లతో అందంగా అలంకరిస్తారు. దీని ఎత్తు 20 అడుగులు. ఖరీదు రూ.25 వేలు. ఈ తొట్టెల తయారీకి ఐదు రోజులు పడుతుంది.
- పాటేల్ తొట్టెల: ఇది 25 అడుగులు పొడవుంటుంది. ఈ తొట్టెల తయారీకి వారం రోజులు పడుతుంది. దీని ఖరీదు రూ.30 వేలు.
- పాము, ఛత్రి, కమలం తొట్టెల: ప్రత్యేక ఆర్డర్‌పై రూపొందిస్తారు. ఇది 20 అడుగులు ఎత్తుంటుంది. దీని తయారీకి నాలుగు రోజులు పడుతుంది. ఈ తొట్టెల ఖరీదు రూ.25 వేలు.

క్లుప్తంగా...

మేడ్చల్ నుంచి మెహదీపట్నంకు ఆర్టీసీ బస్సులు

మేడ్చల్: ప్రయాణికుల సౌకర్యార్థం మేడ్చల్ నుండి మెహదీపట్నం వరకు నూతన బస్సు సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ సుధాకర్‌తెలిపారు. మేడ్చల్ నుంచి బోయిన్‌పల్లి, ప్యారడైజ్, బేగంపేట్, పంజాగుట్ట, బంజారాహిల్స్ మీదుగా మెహదీపట్నం వరకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. సోమవారం నుండి నూతన రూట్ లో బస్సులు ప్రారంభమవుతాయన్నారు. మేడ్చల్ నుండి ఉదయం 6.40 గంటల నుంచి సాయంత్రం7.20 గంటల వరకు బస్సులు తిరుగుతాయన్నారు. మెహదీపట్నం నుండి ఉదయం 8.20 గంటలనుండి రాత్రి 9.05 వరకు బస్సు సర్వీసులు తిరుగుతాయన్నారు.

సన్మానం


అలీ మస్కతిని సన్మానిస్తున్న టీటీడీపీ నాయకులు

చార్మినార్: పాతబస్తీ కోట్ల అలీజాకు చెందిన మస్కతి డైరీ ప్రొడక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ అలీ బిన్ ఇబ్రాహీం మస్కతి మూడో సారి హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం టీటీడీపీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. అలాగే రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కూడా మూడో సారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా టీటీడీపీ సీనియర్ నాయకులు కప్ప కృష్ణగౌడ్, మహ్మద్ ఖాండ్, ప్రకాష్ తదితరులు శనివారం కోట్ల అలీజాలోని ఆయన కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించారు.

ఆకట్టుకున్న నృత్య రూపకం



గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి శాస్త్రీయ సంగీత కళలపై మక్కువ కల్పించాల్సిన అవసరం ఉందని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అరుణ భిక్షు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో నృత్యప్రియ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు స్వప్న కృష్ణమోహన్ శిష్యబృందం ప్రదర్శించిన నౌకా చరితం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్యాగరాజస్వామి రచించిన ఒక భాగాన్ని ఎంపిక చేసుకుని 45 మంది శిష్యులు నృత్య ప్రదర్శన ఇవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు వరం


కిట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ మజహర్ ఉల్లా తదితరులు

గోల్కొండ: గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు వరమని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మహజర్ ఉల్లా అన్నారు. శనివారం ఆయన ఆస్పత్రిలో గర్భిణులకు కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులుగా మార్చి పేదలకు నాణ్యమైన వైద్య సేవలు, నాణ్యమైన ఔషధాలు అందిస్తున్నారన్నారు. 27 వారాల నుంచి 34 వారాల గర్భిణులకు కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ల అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఏఓ డాక్టర్ శ్రీనివాసరావు, గైనకాలజిస్టులు డాక్టర్ సఫనీమ్ మెహర్, డాక్టర్ సౌజన్య, నర్సింగ్ స్టాఫ్‌లు ఫాతిమా, విజిత తదితరులున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందిపై కేసు

అబిడ్స్: డ్రంకన్ డ్రైవ్‌లో అబిడ్స్ ట్రాఫిక్ పోలీసులు 20 కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న 20 మంది వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. 18 మందికి రూ.2,100 చొప్పు జరిమానా విధించారు. మరో ఇద్దరు వ్యక్తులకు రూ.3,300 జరిమానాతో పాటు నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారు. మొత్తం రూ.44,400 జరిమానా వసూళ్లు అయ్యాయని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ఎన్నో ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆయన అన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గోషామహల్ అభివృద్ధికి ప్రత్యేక కృషి


సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి తలసాని, ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ మంత్రి తలసానిని కలిసి పలు సమస్యలు వివరించారు. జాంబాగ్‌లో ఇటీవల అగ్నిప్రమాదం జరగడంతో స్థానిక అపార్టుమెంటు పాక్షికంగా దెబ్బతిందని మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా సమస్యలు వేగవంతంగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తారన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందన్నారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రి తలసాని దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నందుకుమార్, సంతోష్ శుక్లా, కిశోర్, కేలాష్ మిశ్రా, రాజ్‌కుమార్ తివారి, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు


వాల్ రైటింగ్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాంచంద్రారావు

చార్మినార్: రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు ఆశించిన ఫలితాలు సాధిస్తారని బీజేపీ మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు ధీమా వ్యక్తం చేశారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ ఆధ్వర్యంలో శనివారం పాతబస్తీ దారుషిఫాలో జరిగిన బీజేపీ ఉర్దూ వాల్ రైటింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీజేపీ ప్రాబల్యం ఉన్న చోట గోడలపై ఉర్దూలో బీజేపీ కమలం గుర్తులను రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కూడా తమ పార్టీ బలోపేతం అవుతుందన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ భగవంత్‌రావు, అల్కామనోజ్, దినాయత్ అలీ ఖాన్, టి.ఉమామహేంద్ర, ప్రవీణ్ బాగ్దీ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనవారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయంలో లబ్ధిదారుడు గోల్కొండకు చెందిన తౌఫిక్ ఖాన్‌కు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఎల్‌ఓసీను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల శస్త్ర చికిత్సకు సీఎం ఆర్ఎఫ్ పథకం ఎంతో ఉపయోగకరమన్నారు.



ఉచిత వైద్య శిబిరం



అబిడ్స్: గుండె, ఆర్థోపెడిక్, ఇతర విభాగాల్లో కామినేని ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాతబస్తీ మల్లేపల్లి ప్రాంతంలో పేద బడుగు వర్గాల ప్రజల కోసం ఉచితంగా వైద్య సేవలు అందించారు. మోకాళ్ల నొప్పులు, కాళ్లనొప్పులు, గుండె సమస్యలపై వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశ్విన్ తుంకూర్, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ ఆదిత్య, డాక్టర్ ప్రేమ్‌తో పాటు హెల్త్ చెకప్ నిర్వాహకులు షేక్ ఇంతియాజ్, సజ్జాద్, గౌస్ పాషా పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



అబిడ్స్: విద్యార్థులు చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ ఐపీఎస్ అధికారి ఎం.అభినవ్ పేర్కొన్నారు. అబిడ్స్ లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో ప్రిన్సిపాల్ బ్రదర్ షజాన్ ఆంటోని ఆధ్వర్యంలో జరిగిన పాఠశాల క్యాబినెట్ ఇన్వెస్టి టీచర్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తాను పూర్వ విద్యార్థిగా ఇదే పాఠశాలలో చదివి తిరిగి ముఖ్య అతిథిగా రావడం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందని అభినవ్ పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ రేవ్ బ్రదర్ షజాన్ ఆంటోని మాట్లాడుతూ.. తమ పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రావీణ్యం చెందే విధంగా తమ యాజమాన్యం కృషి చేస్తుందన్నారు.

నేడు గోల్కొండలో 2వ బోనం

గోల్కొండ: నేడు గోల్కొండ కోటలో అమ్మవారి 2వ బోనం పూజ జరగనుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవార్ల ఆషాఢ మాసపు బోనాల ఉత్సవాల సందర్భంగా నేడు 2వ పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల దర్శనం కోసం అమ్మవారి ఆలయాన్ని ఉదయం నుంచే తెరిచి ఉంచడం జరుగుతుందని ఆయన తెలిపారు.

గోల్కొండ కోటలో పాము కలకలం



గోల్కొండ: గోల్కొండ కోటలో ఓ నాగు పాము కలకలం సృష్టించింది. కోటలోని సౌండ్ అండ్ లైట్ షో వద్ద ఈ పాము సంచరిస్తుండగా పోలీస్ కానిస్టేబుల్ వెంకటేష్‌నాయక్ చాకచక్యంగా దానిని పట్టుకున్నారు. బోనాల సందర్భంగా ప్రతి ఏటా పాములను పట్టుకోవడంలో నైపుణ్యం ఉన్న వెంకటేష్‌నాయక్‌ను పోలీస్ శాఖ వారు పామును పట్టుకోవడానికి కోటకు పంపుతారు. ఆదివారం గోల్కొండ కోట 2వ బోనం జరగనుండగా వెంకటేష్‌నాయక్ శనివారం సౌండ్ అండ్ లైట్ షో వద్ద పాము అటు నుంచి పోతుండగా దానిని బంధించాడు. పామును వెంకటేష్ నాయక్ సంబంధిత అధికారులకు అప్పగించారు.

బోనాలకు భారీ ఏర్పాట్లు


మంత్రిని కలిసిన మమతాగుప్తా తదితరులు

అబిడ్స్: బోనాల వేడుకలకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేపడుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ మమతాగుప్తాతో పాటు పలువురు ఆలయ నిర్వాహకులు మంత్రి తలసానిని కలిసి బోనాల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంతో పాటు నగరంలోని అన్ని ఆలయాల వద్ద ప్రభుత్వ శాఖల అధికారులే ఏర్పాట్లు చేస్తారన్నారు. జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు, రెవెన్యూ, విద్యుత్, ఇతర శాఖల అధికారులు ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు వేగవంతంగా చేపట్టాలని ఆయన సూచించారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



సంతోష్‌నగర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ గిరిజనులకు పోడు భూములకు పట్టాలు జూన్ 24 నుంచి 30 వరకు ఇస్తామని చెప్పారని.. కానీ ఇప్పుడు మాట తప్పి మరోసారి గిరిజనులకు మోసం చేసినట్టుగా ఉందని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధర్మనాయక్, ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.రఘు, ఆర్.పాండు నాయక్, ఎం.గోపి అన్నారు. హైదరాబాద్ గిరిజన సంఘం జిల్లా ఆఫీస్‌లో విలేకర్ల సమావేశాన్ని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలు నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గిరిజనులు నేటికీ పోడు పట్టాలు రాక వాటికి వచ్చే రైతుబంధు, రైతుబీమా అందకపోవడంతో నేటికీ 17 ఏళ్ల నుంచి మోసపోతూ ఉన్నారన్నారు. తక్షణమే అర్హులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని వారు కోరారు.

కులవృత్తిదారులు కొత్త విధానాలను అనుసరించాలి


ఎంపీ భారతికి వినతి పత్రం అందజేస్తున్న కులవృత్తుల సంఘాల సభ్యులు

జియాగూడ: కులవృత్తిదారులు మారుతున్న కాలానుగుణంగా టెక్నాలజీ ద్వారా కొత్త విధానాలను అనుసరించాలని గుజరాత్ పార్లమెంటు సభ్యురాలు భారతి బేన్ అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడ 2బీహెచ్‌కే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటైన వివిధ కులవృత్తుల వారితో ముఖాముఖి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి, సంత్ రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కులవృత్తుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రధాని మోదీ సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారన్నారు. చేతివృత్తిదారులు అప్‌గ్రేడ్ కావాలని, టెక్నాలజీ ద్వారా కొత్త కొత్త విధానాలు చేపట్టాలని తెలిపారు. గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్, కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి అమర్‌సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి డిజీవర్ సింగ్, డైయిరీ సెల్ కన్వీనర్ శివకుమార్ యాదవ్, పార్లమెంటు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, మాజీ కార్పొరేటర్ మునేందర్ పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు



సిబ్బందితో కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: వర్షాలకు సమస్యలు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. శనివారం జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాల వాహనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలల్లో రోడ్లపై పేరుకుపోయిన మట్టి, డ్రైనేజ్ వ్యర్థాలను సిబ్బందితో తొలగింపు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది కురిసిన వర్షాలక నెలకొన్న సమస్యలు తిరిగి పునరవృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తాం

చార్మినార్: ప్లే గ్రౌండ్‌లలో క్రీడాకారుల సౌకర్యార్థం ఆట వస్తువులతో పాటు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయడానికి వెంటనే తగిన చర్యలు తీసుకోనున్నట్లు జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ నామా సామ్రాట్ అశోక్ హామీ ఇచ్చినట్లు చార్మినార్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ, మొగల్‌పురా డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు పుష్పాల రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు తాము జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో గోపీగౌడ్, మణికొండ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇంటింటికీ బీజేపీ


కార్యక్రమంలో అమర్ సింగ్ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ బలీయంగా ఉందని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్ సింగ్ అన్నారు. శనివారం కార్వాన్ నియోజకవర్గంలో జన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలనలో సాధించిన విజయాల కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోడీ ఆధ్వర్యంలో దేశం విజయపథంలో ముందుకు సాగుతుండగా తెలంగాణలో బీఆర్‌ఎస్ అవినీతి పాలన కొనసాగుతుందన్నారు. తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని ఆయన అన్నారు.

గోషామహల్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం


భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: గోషామహల్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో శనివారం జాంబాగ్ డివిజన్‌లో హట్ డెవలపర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీకి చెందిన నూతన కమ్యూనిటీ హాల్‌కు రాజాసింగ్, కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ హాజరై భూమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు సైతం అభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు. నర్సింహ, సురేష్, రామకృష్ణ, జనార్దన్, బాలకృష్ణగౌడ్, మయూర్ కాలేకర్, అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎంపీ భారతికి సత్కారం



జియాగూడ: దళితుల అభ్యున్నతి బీజేపీ ద్వారానే సాధ్యమని గోల్కొండ జిల్లా ఎస్సీ మోర్చా కోశాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం గుజరాత్ ఎంపీ భారతి బేన్ జియాగూడ జోషిగల్లీలో ఇంటింటికీ బీజేపీ ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను ప్రేమ్‌కుమార్ సత్కరించారు. గోవర్ధన్, రాజ్‌పాల్, శివకుమార్ యాదవ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నవీన్ మిట్టల్‌కు సన్మానం

గోల్కొండ: కళాశాలలో అడ్మిషన్ల క్రమబద్ధీకరణ, ప్రభుత్వ కళాశాలల పటిష్టానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నవీన్ మిట్టల్ అన్నారు. ఉన్నత విద్యాశాఖ నుంచి రెవెన్యూ శాఖకు బదిలీ అయిన నవీన్ మితల్‌ను ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంఘం శనివారం సన్మానించింది. ఈ సందర్భంగా నవీన్ మితల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు పేద బడుగు వర్గాల విద్యార్థులేనన్న విషయాన్ని తాను గమనించానన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల సంఘం అధ్యక్షుడు కపిలవాయి శ్రీనివాసరాజు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ జి. శ్రీనివాస్, డాక్టర్ రాజేందర్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

విదేశాలలో ఉన్న భారతీయులు సంస్కృతికి రాయబారులు


డాక్టర్ కృష్ణ దంపతులకు పురస్కారాన్ని అందజేస్తున్న పలువురు ప్రముఖులు

గన్‌ఫౌండ్రీ: విదేశాలలో ఉన్న తెలుగువారు భారతీయ సంస్కృతికి రాయబారులని పూజ్యశ్రీ గోపాల కృష్ణానంద స్వామీజీ అన్నారు. శనివారం రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వంశీ ఆర్ట్ థియేటర్, ఎంఆర్‌సీ గ్రూప్‌ల ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ డాక్టర్ నడింపల్లి కృష్ణ, లక్ష్మీ దంపతులకు వంశీ గ్లోబల్ లెజండరి అవార్డు, ఆదర్శ దంపతుల పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కృష్ణానంద స్వామీజీ మాట్లాడుతూ.. శాస్త్రవేత్తగా ఆస్ట్రేలియా దేశంలో అక్కడి ప్రభుత్వం చేత గొప్ప సత్కారాన్ని పొందడం ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నిర్మాత ఎంఆర్ చౌదరి, వంశీ ఆర్ట్ థియేటర్స్ వ్యవస్థాపకులు వంశీ రామరాజు, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి



సుల్తాన్‌బజార్: కల్యాణ కట్టలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణ ఉద్యోగులకు భద్రత కల్పించాలని తెలంగాణ రాష్ట్ర దేవాలయాల కల్యాణకట్టల నాయీ బ్రాహ్మణ సంఘం (జేఏసీ) అధ్యక్షుడు రాచకొండ జానకిరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బొగ్గులకుంటలోని దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎండోమెంట్ నిబంధనలకు అనుగుణంగా తమను ఉద్యోగులుగా గుర్తించి జీఓను విడుదల చేయాలని కోరారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కల్యాణకట్ట నాయీ బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు రమేష్, కందుకూరి భగవాన్, హరికుమార్, వెంకటేష్, శ్రీనివాస్, సుదర్శన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.